సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



పొలాల నుంచి రోడ్డు వేయొద్దు

గ్రామసభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించాలని, పొలాల నుంచి జాతీయ రహదారి నిర్మాణం నిలిపి వేయాలని లక్సెట్టిపేటలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. 8లో▸

ఉద్యోగాల పేరిట మోసంపై కేసు

మంచిర్యాలక్రైం: మున్సిపాలిటీలో ఉద్యోగాల పేరిట మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టర్ వర్కర్ చింటు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఎనిమిది మంది నుంచి రూ.50వేల చొప్పున తీసుకున్నాడని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నవీన్‌తోపాటు మరో ఏడుగురు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఆదివాసీ దినోత్సవం కరపత్రాలు విడుదల



కరపత్రాలతో కలెక్టర్ కుమార్‌దీపక్, నేతలు

చెన్నూర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కరపత్రాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం విడుదల చేశారు. చెన్నూర్‌లో ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆదివాసీ సంఘం నాయకులు తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలకు చెందిన ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు జేక శేఖర్, దుగ్నె జయిలు, చెడెంకి మాంతయ్య తదితరలు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల విభాగం



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: చాలాకాలం తర్వాత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల విభాగం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొదటి రోజు 15మంది ఫిర్యాదు చేయగా క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత ప్రాంతాల పోలీస్ అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. కొందరు ఇతర శాఖల సమస్యలపై ఫిర్యాదు చేయడంతో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో బాధితులు ఎవరైనా తమకు జరిగిన అన్యాయంపై నిర్భయంగా, నేరుగా ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదులను పరిశీలించి చట్టపరిధిలో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కమిషనర్ శ్రీనివాసరావు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కే.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మందమర్రి మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో మెప్మా విభాగంలో కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావును బెల్లంపల్లికి బదిలీ చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. చైర్‌పర్సన్ శ్వేతను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వాహనాలు పర్యవేక్షించాలి

మంచిర్యాలక్రైం: పోలీసుల వాహనాలను నిరంతరం పర్యవేక్షించాలని అడిషనల్ డీసీపీ రాజు వాహనాల డ్రైవర్లకు సూచించారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో పోలీస్ వాహనాలను పరిశీలించారు. వాహనాల నిర్వహణ రోజువారీగా పరిశీలించాలని తెలిపారు. ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర పాల్గొన్నారు.

ఆపరేషన్ డెకాయ్

- ఇక దూకుడు పెంచనున్న పోలీసులు
- నేరాలకు ఆస్కారం ఉన్న చోట్ల మఫ్టీలో నిఘా
- నేరగాళ్లను గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం
- అవసరమైతే కాల్పులకు సిద్ధం



ఆపరేషన్ డెకాయ్ ద్వారా గంజాయి సరఫరా చేసే వ్యక్తిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

మంచిర్యాలక్రైం: ఫ్యాక్షన్ తరహా దాడులు అరికట్టేందుకు, నేరాల నియంత్రణకు పోలీసు శాఖ రంగంలోకి దిగింది. నేరాలకు ఆస్కారం ఉన్న చోట్ల మఫ్టీలో నిఘా వేస్తోంది. అవసరాన్ని బట్టి తుపాకికి పని చెప్పేలా బృందాలను సిద్ధం చేసింది. గత నెల 31న జిల్లా కేంద్రంలోని సినిమా థియేటర్ వద్ద ఓ పాన్ షాపు ముందు రాత్రి 11.30గంటలకు కొందరు యువకులు మద్యంమత్తులో చిందులు వేస్తూ ఒకరిపైనొకరు దాడి చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 2న బీఆర్‌ఎస్ నాయకుడు, జిమ్ యజమాని గడప రాకేష్‌పై వేకువజామున మాటువేసి దాడి చేయడం మంచిర్యాలలో భయానక వాతావరణాన్ని సృష్టించింది. జిల్లాలో కొందరు రియల్టర్లు తమ వ్యక్తిగత అవసరాల కోసం అవసరమైతే దాడులు చేసేందుకు కొందరు యువతను పెంచి పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని కత్తులతో బెదిరించి దాడి చేసి అందినకాడికి దోచుకోవడం, చేతిలోని సెల్‌ఫోన్ లాక్కోవడం, కర్రలు, కత్తులతో దాడి చేసి హత్య చేసి, దాడులకు పాల్పడిన ఘటనలు, దోపిడీ, దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, రౌడీయిజం, మహిళలపై దాడులు, ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలతో శాంతిభద్రతలపై ప్రభావం పడుతోంది. ప్రజలు అభద్రతాభావానికి లోనుకాకుండా, శాంతిభద్రతలపై ప్రభావం చూపే నేరాలను ఉపేక్షించకూడదని పోలీసు శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక పోలీసు బలగాలతో ఆపరేషన్ డెకాయ్ బృందాలతో మఫ్టీలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తోంది.

అవసరమైతే తుపాకీ వినియోగం..

డెకాయ్ టీమ్ అవసరమైతే కాల్పులు జరిపేలా ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. బందోబస్తు కేసుల భారం నేపథ్యంలో కమిషనరేట్‌కు సంబంధించి శాంతిభద్రతల విభాగం పోలీసులు సుదీర్ఘకాలంగా తుపాకికి, ఫైరింగ్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆపరేషన్ డెకాయ్ టీమ్‌లో ఏఆర్ కానిస్టేబుళ్లను తీసుకున్నారు. కరడుగట్టిన నేరగాళ్ల కొన్ని సందర్భాల్లో ఎదురుదాడికి దిగడం, కాల్పులు జరపడం వంటి ఘటన గతంలో చోటు చేసుకున్న ఉదంతాలు ఉండడంతో ఆపరేషన్ డెకాయ్ టీమ్ అవసరమైతే కాల్పులు జరిపేందుకు సిద్ధంగా ఉంటారు.

నిఘా ఉంచడమే వీరి ప్రధాన విధి..

డెకాయ్ టీమ్‌లో స్థానిక పోలీసుస్టేషన్ కానిస్టేబుళ్లతోపాటు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన కానిస్టేబుల్ ఉంటారు. హాట్‌స్పాట్‌తోపాటు క్రైమ్‌ప్రోన్ ఏరియాల్లో నిర్దేశిత సమయంలో మఫ్టీలో సంచరిస్తూ నేరగాళ్ల కదలికలపై నిఘా ఉంచడం వీరి ప్రధాన విధి. తమ ఉనికి బయటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వారి దృష్టికి వచ్చిన అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరగాళ్ల సమాచారం స్థానిక పోలీసులకు అందిస్తారు. ఇటీవల మంచిర్యాల పోలీసులు డెకాయ్ ఆపరేషన్ ద్వారా మహారాష్ట్రకు చెందిన గంజాయి స్మగ్లర్ ఎస్‌కే.రిజ్వాన్‌తోపాటు మంచిర్యాలకు చెందిన మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఏడాది మే25న జిల్లాలో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఏడుగురు దొంగలను పట్టుకున్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ ప్రత్యేక డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తోంది. హాట్‌స్పాట్‌లు, కళాశాలల వద్ద మఫ్టీలో ఉంటూ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా వేస్తూ స్థానిక పోలీసులకు అందిస్తారు.

నేర ప్రాంతాలను గుర్తించి..

కమిషనరేట్‌లోని ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక డెకాయ్ టీమ్ పని చేస్తుంది. వీటి మోహరింపులోనూ ఉన్నతాధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మొదటి సారిగా జిల్లా వ్యాప్తంగా పోలీసుస్టేషన్ల వారీగా రాత్రివేళల్లో నడిరోడ్లపై నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న, పదే పదే నేరాలు జరిగిన ప్రాంతాలను గుర్తించారు. ఈ జాబితా ఆధారంగా హాట్‌స్పాట్‌ను గుర్తించి ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో డెకాయ్ టీమ్ రాత్రి 10గంటల నుంచి తెల్లవారు జామున 5గంటల వరకు పర్యటిస్తుంది.

ప్రజల భద్రత కోసమే..



కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు ఆపరేషన్ డెకాయ్ నిర్వహించడం జరుగుతోంది. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, దోపిడీ దొంగలు, గంజాయి, ఇతర డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక బృందాలు హాట్‌స్పాట్‌ల వద్ద మఫ్టీలో ఉంటూ నిఘా వేస్తారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం, పాత నేరస్తుల కదలికలను కనిపెడతారు. డెకాయ్ ఆపరేషన్ సభ్యులు పూర్తిగా రహస్యంగా ఉంటారు.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ర్యాలీలో కలెక్టర్ కుమార్‌దీపక్

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలతోనే మానవాళికి జీవన మనుగడ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఈ నెల 9వరకు అందరూ ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ప్రజలు పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా పచ్చదనంతో నిండిపోవాలని తెలిపారు. అనంతరం పరిశుభ్రత, మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ప్రత్యేకాధికారి స్వప్న, డీఎల్పీవో ధర్మరాణి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటరమణ, కార్యదర్శి వంశీకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. మండలాల్లోని కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు కనీస మౌలిక వసతులు లేవని, రాత్రివేళల్లో విధులు కేటాయిస్తున్నారని, సమయపాలన పాటించాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనాన్ని సంఘం మాజీ అధ్యక్షుడు కూరపాటి రాజయ్య, కుమారులు కబ్జా చేశారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సుమిత్, నాయకులు గోవర్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడి పరిశుభ్రత బాధ్యత 'అమ్మ'కే..!

- స్కూల్ ఫెసిలిటి మెయింటనెన్స్ గ్రాంటు మంజూరు
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డీఎంఎఫ్‌టీ నిధులు



పాఠశాల తాగునీటి కుళాయి చేతులు కడుగుతున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేటుకు దీటుగా కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దుతోంది. మన ఊరు–మన బడితోపాటు అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట పనులు సాగుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. నిత్యం తరగతి గదులు, ఆవరణ శుభ్రం చేసే పాఠశాల పారిశుద్ధ్య కార్మికులను తొలగించడంతో ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఇదివరకు ఉపాధ్యాయుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పాఠశాలల పరిశుభ్రతకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రత్యేక నిర్వహణ గ్రాంటును మంజూరు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇకపై పాఠశాలల పరిశుభ్రత బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీకి అప్పగించింది. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తొలగనున్నాయి.

ప్రత్యేక నిధులు ఇలా..

ప్రభుత్వ, స్థానిక, మోడల్ స్కూళ్లకు ప్రత్యేకంగా విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా టాయిలెట్ల శుభ్రత, మొక్కలకు నీరు పోయడం, ఆవరణ శుభ్రత ఖర్చుల కోసం ప్రభుత్వం సౌకర్యాల నిర్వహణ గ్రాంటు(స్కూల్ ఫెసిలిటి మెయింటనెన్స్ గ్రాంటు) అందించాలని నిర్ణయించింది. సమగ్ర శిక్ష కింద అందిస్తున్న కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా గ్రాంటు అందించనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పది నెలలపాటు పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు నిధులు విడుదలవుతాయి. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) నుంచి స్కూల్ ఫెసిలిటి మెయింటనెన్స్ గ్రాంటు మంజూరు చేయనున్నారు. పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు శుభ్రం చేయడం, మూత్రశాలల క్లీనింగ్, మొక్కలకు నీరుపోయడం పనులు చక్కబెట్టేందుకు వీలుకు కమిటీలకు మూడు నెలల ముందుగానే డబ్బులు విడుదల చేస్తారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల కానున్నాయి. జిల్లాలోని 719 పాఠశాలలకు ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయనున్నారు. 1నుంచి 30 మంది వరకు విద్యార్థులు ఉంటే రూ.3వేలు, 31నుంచి 100 మంది వరకు ఉంటే రూ.6వేలు, 101 నుంచి 250మంది వరకు విద్యార్థులకు రూ.8వేలు, 251నుంచి 500మంది వరకు రూ.12వేలు, 501 – 750 మంది వరకు రూ.15వేలు, 750పైన విద్యార్థులున్నా పాఠశాలకు రూ.20వేలు ప్రతీ నెల ఇవ్వనున్నారు. విద్యాసంవత్సరంలో 10 నెలలపాటు నిధులు చెల్లిస్తారు.

ఇదివరకు ఇలా..

కరోనాకు ముందు పాఠశాలల్లో విధులు నిర్వర్తించిన స్కావెంజర్లను కరోనా కాలం తర్వాత ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందితో పాఠశాలలను శుభ్రపర్చుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని చోట్ల ఆడపాదడపా పాఠశాలలను శుభ్రం చేస్తున్నా మెజార్టీ పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత అంతంత మాత్రంగానే మారింది. పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది కొరత వల్ల వీలున్నప్పుడు వచ్చిన సందర్భాలు లేకపోలేదు. ఉపాధ్యాయులు అడిగినప్పుడు మాత్రమే పంపించి శుభ్రత పనులు చేస్తున్నారు. ఊరిని ఊడ్చడం, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్త సేకరణ, ఇతరత్రా పనులు చేయడానికి సమయం సరిపోవడం లేదని గ్రామాల్లో సిబ్బంది పాఠశాలలకు రాని పరిస్థితి. దీంతో మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి దుర్వాసన వస్తుండడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పలేదు. పాఠశాలకు ప్రత్యేక నిర్వహణ గ్రాంటులు మంజూరుతో పాఠశాల శుభ్రత గాడినపడే అవకాశం ఉంది.

జిల్లాలో పాఠశాలలు, ఎన్‌రోల్‌మెంట్ స్లాబ్ ఈ విధంగా ఉన్నాయి

విద్యార్థుల సంఖ్య	పీఎస్	యూపీఎస్	హైస్కూల్	మొత్తం స్కూళ్లు
సున్న	27	–	–	27
1నుంచి 30వరకు	341	37	05	383
31నుంచి 100	132	54	48	234
101నుంచి250	10	05	43	58
251నుంచి500	0	0	13	13
501నుంచి750	0	0	04	04
	510	96	113	719

అర్జీలన్నీ పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో వచ్చిన అర్జీలన్నీ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్లు, పరిహారం, రుణమాఫీ తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని, తమ పరిధిలో లేకుండా సమస్య పరిష్కారం కాదని చెప్పాలని అన్నారు.

- తాండూర్ మండలం రేచిని గ్రామకంఠం ప్రభుత్వ భూమిని సర్వేనంబరు 637లో ఆరు గుంటలు బోనగిరి గణేష్, ముక్క రాజేశం కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.
- విద్యార్థులతో పని చేయించుకుంటున్న మంచిర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, నాయకుడు మిట్టపల్లి తిరుపతి కోరారు.
- ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపుతో హాజీపూర్ మండలం కొండపల్లి గ్రామంలో ఇల్లు, స్థలం నష్టపోయానని, పరిహారం కింద రూ.3.70లక్షలు మంజూరు చేసినా ఇప్పటివరకు జమ కాలేదని గ్రామానికి చెందిన చెనాల శాంతమ్మ ఫిర్యాదు చేసింది.
- భీమారం మండలం ఆరెపల్లి పెద్దచెరువు కాలువ సర్వే నంబరు 205వరకు వచ్చి ఆగిందని, సర్వే నంబర్లు 206, 204, 198 వరకు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని, సాగు నీరు అందేలా చూడాలని రైతులు కోరారు.

రుణమాఫీ నగదు ఇవ్వడం లేదు..



మంచిర్యాల ఏడీసీసీబీ కోఆపరేటివ్ బ్యాంకులో ఎలాంటి రుణం తీసుకోలేదు. రుణమాఫీ పథకం రెండో విడతలో నా పేరు మీద రుణం తీసుకున్నట్లు, రూ.1,05,515 మాఫీ అయినట్లు నా సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. కానీ నా ఖాతాలో డబ్బు జమ కాలేదు. మంచిర్యాల ప్రాథమిక సహకార సంఘం సీఈవో పెంట సత్యనారాయణ మాఫీ నగదు ఖాతాలో జమ చేయడం లేదు. నాకు వచ్చిన రుణమాఫీ నగదు కాజేయాలని చూస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలి.

– సిరిపెల్లి బాపు, గ్రామం: ముల్కల్ల, మం: హాజీపూర్

పట్టాపాసు పుస్తకం ఇప్పించాలి



నా భర్త 2018లో చనిపోయాడు. నాకు ఇద్దరు ఆడపిల్ల లు. మామ పేరిట ఉన్న ఆరెకరాల భూమి మా బావ పేరుమీద చేసుకున్నారు. కోర్టులో కేసు వేయడంతో వారసత్వంగా రావాల్సి న భూమి అనుకూలంగా తీర్పు వచ్చింది. మూడెకరాల భూమి సాగు చేసుకుంటున్నాం. కోర్టు తీర్పు ప్రకారం మా బావ పేరిట ఉన్న ఆరెకరాల్లో మూడు ఎకరాల భూమి నా పేరుమీద పట్టా పాసుపుస్తకం ఇప్పించాలి.

– కాళేశ్వరం రజిత, గ్రామం: కొమ్మెర, మం: చెన్నూర్

రుణమాఫీ.. స్వాహా..!

- రైతుల పేరిట రుణాలు.. మాఫీ జేబుల్లోకి..
- కలెక్టర్‌కు బాధిత రైతుల ఫిర్యాదు
- జిల్లాలో పలు సంఘాల్లో సీఈవోల చేతివాటం

మంచిర్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ సహకార సంఘాల్లో రుణమాఫీ స్వాహా పర్వం వెలుగు చూస్తోంది. రుణాలు తీసుకోని రైతులకు రుణమాఫీ మెస్సేజ్‌లు వస్తుండడంతో జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జరిగిన అక్రమాల బాగోతం బయటపడుతోంది. దీంతో ప్రజాఫిర్యాదుల విభాగంలో రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. మంచిర్యాల సహకార సంఘం సీఈవోపై ఇప్పటికే పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. రుణమాఫీ పథకంలో మొదటి, రెండో విడతల్లో రుణమాఫీపై రైతులకు మెస్సేజ్‌లు వచ్చాయి. నగదు రాకుండా సీఈవో హోల్డ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. మంచిర్యాలకు చెందిన సంఘంలోని సీఈవో తొమ్మిది మంది రైతుల పేరిట రూ.లక్షల్లో రుణాలు పొంది మాఫీ డబ్బులు కాజేయాలని చూసినట్లు తెలుస్తోంది. జిల్లాలో 20 సహకార సంఘాలు ఉండగా.. రైతుల పేరిట ఎన్ని సంఘాల్లో అక్రమ రుణాలు తీసుకున్నారనేది పూర్తి స్థాయిలో విచారణ చేపడితే బయటకు వచ్చే అవకాశం ఉంది. రైతులకు తెలియకుండా వారి భూపత్రాలు, ఆధార్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో సహకార సంఘాల్లో కొందరు సీఈవో రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో రుణాలు తీసుకుని చెల్లించడం, ఎరువులు, సేంద్రియ కర్బనం జీలుగ, జనుము కొనుగోలు సమయంలో పట్టాపాస్‌పుస్తకంతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. వీటితో రుణాల రీషెడ్యూల్‌కు వీలుంటుంది. ఇలా రైతుల పేరిట ఏడీసీసీ(ఆదిలాబాద్ డిస్ట్రిక్ సెంట్రల్ కోఆపరేటివ్) బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. రుణమాఫీ పథకం అమలుతో వారికి కలిసి వస్తోంది. కొందరు రైతులకు తెలియకుండా కాజేస్తుండగా.. మరికొందరు రైతులతో పరస్పర ఒప్పందంతో మాఫీ నగదు సగం సగం తీసుకుంటున్నారు. రుణం మాఫీ అయిందంటూ రైతుల సెల్‌కు వస్తున్న మెస్సేజ్‌లను చూసి ఎప్పుడు రుణం తీసుకున్నామని ఆశ్చర్యపోతున్నారు. సొసైటీలో అడిగితే డమ్మీ మెస్సేజ్ అంటూ చెబుతున్నారు. వ్యవసాయ అధికారులను అడిగితే మాఫీ వర్తించిందని స్పష్టం చేస్తున్నారు. ఆన్‌లైన్ రికార్డు ధ్రువీకరణ పత్రాలు తీసి ఇస్తున్నారు. వీటితో సీఈవో వద్దకు వెళ్లి నిలదీస్తుండడంతో కాళ్లబేరానికి వస్తున్నారు. కొందరు రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కమిషనర్‌కు పంపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఓ రైతుకు రుణమాఫీ జరిగినట్లు వ్యవసాయ అధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రం

రూ.90 వేలు మాఫీ మెస్సేజ్

ఏడీసీసీ బ్యాంకులో రూ.90,772 రుణం మాఫీ అయినట్లు నా సెల్‌కు మెస్సేజ్ వచ్చింది. ఆ బ్యాంకులో పంట రుణమే తీసుకోలేదు. సొసైటీ సీఈవోను ప్రశ్నిస్తే 2015లో రూ.20వేలు తీసుకుని 2018లోరూ.40వేలు రెన్యూవల్, 2023లో రూ.90వేలు రెన్యూవల్ చేసినట్లు ఏవేవో లెక్కలు చెప్పాడు. 2006లో సొసైటీ ద్వారా బోరుబావి కోసం మార్టిగేజ్ రుణం రూ.30వేలు తీ సుకున్న.. దానికి సంబంధించి లోన్ చెల్లిస్తున్న. ఆ డాక్యుమెంట్లతో పంట లోను తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇదేమని నిలదీస్తే బేరసారాలకు వస్తున్నాడు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన.

– కందుల లక్ష్మణ్, గ్రామం: ముల్కల్ల, మం: హాజీపూర్

విచారణ చేపడుతున్నాం..

రైతుల పేరుతో అక్రమ రుణాలు తీసుకొని రుణమాఫీ నగదు కాజేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఓ అధికారితో విచారణ చేపడుతున్నాం. రెండు మూడు రో జుల్లో తెలుస్తుంది. నిజమని తేలితే చట్టపరమైన చర్యలు తప్పవు.

– బి.రాంమోహన్, జిల్లా సహకార శాఖ అధికారి

రుణమాఫీ కాలేదు..



గతేడాది కెనరా బ్యాంకులో పంట రుణం రూ.72 వేలు మా నాన్న దేవయ్య పేరు మీద తీసుకున్నాం. రుణమాఫీ పథకంలో మొదటి, రెండో విడతలో పేరు రాలేదు. మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే మా దగ్గర ఏమీ లేదంటున్నారు. మాఫీ అయ్యేలా చూడాలి.

– వెల్పుల చంద్రకుమార్, గ్రామం: బుచ్చయ్యపల్లి, మం: బెల్లంపల్లి

మాఫీ కాలేదు..



ఎకరన్నర భూమికి గాను గతేడాది జూన్‌లో రూ.60 వేల పంట రుణం తీసుకున్నా. రెండు విడతల మాఫీ జాబితాలో పేరు రాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే ఆగస్టులో విచారణ చేపడుతాం అంటున్నారు. మాఫీ జరిగేలా చూడాలి.

– ఎగుర్ల రాజేశం, గ్రామం: బట్వాన్‌పల్లి, మం: బెల్లంపల్లి

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

పాతమంచిర్యాల: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగిన ప్రకృతి విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.మానసయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతం నుంచి ప్రజలను తరలించి పునరావాసం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు గోగర్ల తిరుపతి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.శంకర్, కార్యదర్శి నర్సింహా ఉపాధ్యక్షుడు రాజన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాడి మీదనే ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

వేమనపల్లి: మండలంలోని సుంపుటం గ్రామపంచాయతీకి చెందిన పాణం ప్రకాశ్ ఎద్దు సోమవారం పొలం దున్నుతుండగా మృతి చెందింది. అకస్మాత్తుగా ఎద్దు మృతి చెందగా నిరుపేద కుటుంబానికి చెందిన ప్రకాశ్ నష్టపోయాడు. ఎద్దు విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని, అధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఇసుక లారీ పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నారు. తనిఖీల్లో భాగంగా ఎస్సై సురేశ్ వాహన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లోడ్‌తో ఉన్న లారీని స్టేషన్‌కు తరలించారు. యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తిర్యాణి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని చెలిమల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాణిక్యపూర్ గ్రామం నుంచి తిర్యాణి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న విల్సన్ (48) చెలిమల గ్రామ శివారులో నడుచుకుంటూ వెళ్తున్న టీకం పాండును ఢీకొట్టాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడగా విల్సన్ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు.

గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి లంబాడి తండాకు చెందిన ఇద్దరు సోమవారం గుడుంబా అమ్ముతుండగా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నర్సింహులు తెలిపారు. కాలనీకి చెందిన లక్ష్మి, అనిత నాటుసారా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పొలాల నుంచి రోడ్డు వేయొద్దు

- పాత పద్ధతిలో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో రైతుల అభిప్రాయం
- సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్



సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

లక్సెట్టిపేట: గ్రామసభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించాలని, పొలాల నుంచి జాతీయ రహదారి నిర్మాణం నిలిపి వేయాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. పాతపద్ధతి ప్రకారం జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాల్‌లో 63వ జాతీయ రహదారి నిర్మాణంపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంతో కాలుష్యం, నివారణ చర్యలపై రైతులు అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పొలాల నుంచి రహదారి నిర్మాణం నిలిపివేయాలంటూ రైతులు సమావేశం నుంచి వెళ్లిపోతుండగా.. పోలీసులు వారితో మాట్లాడి అభిప్రాయాలు తెలియజేయాలని శాంతింపజేశారు. రహదారి నిర్మాణంతో పొలాలు నష్టపోతున్నామని, ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపులో చాలా భూములు నష్టపోయామని, మళ్లీ రహదారితో పూర్తి స్థాయిలో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలు ఏర్పాటు చేయకుండా, ఎవరి అభిప్రాయాలు తీసుకోకుండా రహదారి నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఏజెన్సీ సభ్యులు అభిప్రాయ సేకరణ చేసినట్లు తప్పుడు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తున్నారని మండిపడ్డారు. 2018, 2023లో సర్వే చేసి వాటిని అమలు చేయకుండా ప్రస్తుతం వ్యవసాయ భూముల నుంచి రహదారి నిర్మాణం చేపట్టడం, రైతుల పొట్టగొట్టి నిర్మిస్తున్నారని అధికారులను నిలదీశారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తానని పేర్కొన్నారు. 58దరఖాస్తులు వచ్చాయని, 21మంది రైతులు అభిప్రాయాలు వెల్లడించారని, వాటిని వీడియో ద్వారా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి లక్ష్మణప్రసాద్, ఆర్డీవో రాములు, పీడీ అజయ్‌మణికుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలుష్యంపై ప్రజాభిప్రాయం కోసం

మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్టు ప్రకారం సమావేశం ఏర్పాటు చేశాం. ఏదైనా ప్రాజెక్టు అనుమతి పొందాలంటే ప్రజాభిప్రాయ సేకరణ వీడియోగ్రఫీ చేసి మినిస్ట్రీకి పంపిస్తాం. అనుమతి ఇవ్వచ్చా, ఇవ్వరాదా అనేది కమిటీ నిర్ణయిస్తుంది. అన్ని వివరాలు పంపిస్తున్నాం.

– లక్ష్మణప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ అధికారి, నిజామాబాద్

పట్టించుకోవడం లేదు



జాతీయ రహదారి నిర్మాణం నిలిపివేయాలని అధికారుల వద్దకు వెళ్తే ఎవరూ పట్టించుకోవడం లేదు. రహదారి నిర్మాణం నిలిపి వేయకుంటే ఆత్మహత్య చేసుకుంటాం. రైతులను చిన్నచూపు చూస్తున్నారు. పాత పద్ధతి ప్రకారమే రహదారి నిర్మాణం చేయాలి. నిర్మాణం నిలిపి వేయాలంటే మహిళలని కూడా చూడకుండా అరెస్టు చేశారు.

– రమ, సూరారం గ్రామం

మా భూములు ఇవ్వం



మాకు ఉన్నది రెండెకరాల భూమి. అందులో నుంచి రహదారి నిర్మాణం కోసం తీసుకుంటామని మాకు చెప్పలేదు. మా భూములను ఇవ్వం. రైతులను రోడ్డున పడేస్తున్నారు. మా పిల్లలు ఎలా బతకాలి. బయట భూములకు అధిక ధరలు ఉన్నాయి. మేము భూమిని నమ్ముకుని కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నాము.

– సుజాత, సూరారం గ్రామం

తప్పుడు నివేదిక పంపుతున్నారు



ఏజెన్సీ సిబ్బంది కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదిక పంపుతున్నారు. ఎక్కడా గ్రామసభలు నిర్వహించలేదు. ప్రజల అభిప్రాయాలను సేకరించలేదు. సమాజంలో జాతీయ రహదారి నిర్మాణంపై ఎలాంటి సర్వేలు చేయలేదు. వన్యప్రాణులు, చెట్లు అన్ని ఉన్నాయి. జాతీయ రహదారి నిర్మాణంతో కాలుష్యం వస్తుంది. ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– నారపరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, లక్సెట్టిపేట

పదెకరాలు నష్టపోయాను



ఎల్లంపల్లి ముంపులో పదెకరాలు నష్టపోయాను. ఇప్పుడు జాతీయ రహదారి నిర్మాణంతో పూర్తి భూమిని నష్టపోతున్నాను. ఇప్పటివరకు ఎవ్వరు నన్ను అడగలేదు. నా భూమిలోంచి ఫోర్‌లేన్ వేస్తున్నారని తెలిసింది. సర్వే ఎప్పుడు చేశారో తెలియదు. గ్రామసభలు పెట్టలేదు. వ్యవసాయ భూములు నష్టపోతున్నాం. పొలాల నుంచి ఫోర్‌లేన్ రోడ్ వేయవద్దు.

– పాదం శ్రీనివాస్, మోదెల గ్రామస్తుడు

8న సింగరేణి, రామగిరి రైళ్ల రాకపోకలు బెల్లంపల్లి నుంచే..

బెల్లంపల్లి: సింగరేణి, రామగిరి రైళ్లు ఈనెల 8వ తేదీన బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చి ఇక్కడి నుంచే తిరుగు ప్రయాణం సాగించనున్నాయి. ఆయా రైళ్ల రాకపోకల సమయ సూచికను రైల్వే అధికారులు తాత్కాలికంగా మార్పు చేశారు. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ శ్రీధర్ సోమవారం ప్రకటించారు. భద్రాచలం రోడ్-బల్లార్షా మధ్య రోజూ రాకపోకలు సాగించే సింగరేణి మెమో (రైలు నంబర్ 17033), బల్లార్షా-కాజీపేట్ మధ్య నడిచే రామగిరి (రైలు నంబర్ 17004) రైళ్లను అప్, డౌన్ మార్గాల్లో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి నడపనున్నట్లు తెలిపారు. ఇదేతీరుగా జైపూర్-మైసూర్ మధ్య నడిచే మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 12976) రైలు ఈనెల 7వ తేదీన గంట ఆలస్యంగా నడవనున్నట్లు ప్రకటించారు. మహారాష్ట్రలోని వీరూర్, వీర్‌గామ్ రైల్వేస్టేషన్ల పరిధిలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మార్పును గమనించాలని అధికారులు ప్రయాణికులకు సూచించారు.

దాడిచేసిన నలుగురిపై కేసు

నెన్నెల: నార్వాయిపేటకు చెందిన రైతు పాల్త్యా రమేశ్‌పై దాడిచేసిన పాల్త్యా లాక్యా, ఫాల్త్యా రాజేశ్, దరావత్ రవి, రజితపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్, లాక్యాల పత్తిచేన్లు పక్కపక్కనే ఉన్నాయి. రమేశ్ తన చేనుకు గడ్డి మందు కొట్టగా దాని ప్రభావంతో లాక్యా చేనులోని పత్తి మొక్కలు వాడిపోయాయి. దీనిపై పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహిస్తున్న సమయంలో లాక్యా కుటుంబ సభ్యులు కర్రలతో దాడిచేసి రమేశ్‌ను కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన చెన్నూర్ ఎంజేపీ విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. అండర్-18లో 400 మీటర్ల పరుగు పోటీలో టీ ప్రశాంత్ ప్రథమ, అండర్-14లో 400 మీటర్ల పరుగు పోటీలో టీ రిషిత్ ప్రథమ, సాయి రుత్విక్ ద్వితీయ, 100 మీటర్ల పరుగు పోటీలో మణికంఠ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 7నుంచి మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. విజేతలను పీఈటీ విజయ్‌కుమార్, ఏటీపీ శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ అశోక్‌కుమార్ అభినందించారు.

లాభాల వాటా 35శాతం చెల్లించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లో 35శాతం వాటా వెంటనే ప్రకటించి ఉద్యోగులకు పంపిణీ చేయాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఏరియాలోని వర్క్‌షాపులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు కష్టపడి సంస్థకు లాభాలు వచ్చేలా సహకరిస్తే ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలైనా ఇంతవరకు లాభాలు ప్రకటించకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. గుర్తింపు సంఘానికి ధ్రువపత్రం అందించాలని, సింగరేణిలో నెలకొన్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన కారులో మంటలు



కారులో మంటలను ఆర్పుతున్న స్థానికులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియా రహదారిపై సోమవారం పార్కింగ్ చేసి ఉన్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కారు యజమాని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. స్థానికుల సాయంలో సమీపంలోని నీటి పైపు ద్వారా మంటలను అదుపు చేశాడు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బుల్లెట్ ఫైర్ మిషన్ ద్వారా మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు. కారు యజమాని మంచిర్యాలకు చెందిన మామిడాల నర్సింహస్వామి పని మీద మార్కెట్‌కు వచ్చి రోడ్డు పక్కన పార్కింగ్ చేసి దుకాణంలోకి వెళ్లాడు. వెళ్లిన 10 నిమిషాల వ్యవధిలో మంటలు వచ్చినట్లు తెలిపాడు. స్థానికుల సమయస్ఫూర్తితో పెనుప్రమాదం తప్పిందని ఫైర్ అధికారులు తెలిపారు. కాగా, కారు బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ తోనే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన గేడం శశిరేఖ తనకు ఏదైనా ఉద్యోగం కల్పించాలని, నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చౌహాన్ బన్నీ తనకు ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ ఇప్పించాలని, వాంకిడి మండలం లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం రాము తనకు ఇల్లు మంజూరు చేయించాలని, మామడ మండల కేంద్రానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించాలని కోరారు. పింఛన్, డబుల్‌బెడ్రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీవో వసంత్‌రావు, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఆర్సీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల జలపాతంలో ఒకరు గల్లంతు

తిర్యాణి: మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం ఒకరు గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణానికి చెందిన రుషి అనే యువకుడు జలపాతంలో స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. అతడి కోసం స్నేహితులు, బంధుమిత్రులు వెతికారు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టనున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

అపహరణకు గురైన ట్రాక్టర్ బోల్తా

ఆసిఫాబాద్‌రూరల్: అపహరణకు గురైన ట్రాక్టర్ బోల్తా పడింది. మండలంలో తుంపెల్లి గ్రామానికి చెందిన ముక్తార్ తన ట్రాక్టర్‌ను ఇంటి వద్ద నిలిపి ఉంచగా ఆదివారం రాత్రి అపహరణకు గురైంది. ఉదయం తన ట్రాక్టర్ చోరీకి గురైనట్లు గుర్తించిన ముక్తార్ పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు కోసం ఆసిఫాబాద్‌కు వస్తుండగా గుడేన్ ఘట్ వాగు వంతెన వద్ద తన ట్రాక్టర్ బోల్తా పడి కనిపించినట్లు ముక్తార్ తెలిపారు. ట్రాక్టర్ దొంగిలించిన వ్యక్తులు ఎవరనేది తెలియరాలేదు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని బలవన్మరణం



సోని (ఫైల్)

వాంకిడి: కడుపునొప్పి భరించలేక జీఎన్‌ఎం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బెండార గ్రామానికి చెందిన సెండె బొంద్యాలు చిన్న కూతురు సోని (20) హైదరాబాద్‌లోని గౌతమి కళాశాలలో జీఎన్‌ఎం రెండో సంవత్సరం చదువుతోంది. సోనీ ఏడాదిన్నరగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు వివిధ ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ క్రమంలోనే కడుపు నొప్పి ఎక్కువ కావడంతో హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చిన సోని సోమవారం మధ్యాహ్నం ఇంట్లోని గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి బొంద్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి శివారులోని చెట్లపొదల్లో పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్సైలు ఉపేందర్, లచ్చన్న సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.21,450 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్న మరో ఐదుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మీనగర్‌లో..

నస్పూర్: స్థానిక సీసీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల్లో ఓ ఇంట్లో పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకోగా, మరో వ్యక్తి పరారయ్యాడు. వీరి నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

జిల్లా కేంద్రంలో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ శివారు ప్రాంతంలో పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు సోమవారం సీఐ బన్సిలాల్, ఎస్సై సురేశ్, డీకాయ్ టీమ్ సభ్యులతో కలిసి పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. అప్పటికే పోలీసులను గమనించిన ఐదుగురు పేకాట రాయుళ్లు పారిపోగా ఇద్దరు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.8,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారైనవారినీ పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

మట్కా ఆడుతున్న యువకుడి అరెస్ట్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫ్లైఓవర్ కింద మట్కా ఆడుతుండగా, సోమవారం పట్టణ పోలీసులు దాడి చేసి యువకుడిని పట్టుకున్నారు. పట్టణానికి చెందిన రాజేశ్ బిశ్వాస్‌ను తనిఖీ చేసి మట్కాకు సంబంధించి ఐదు చిట్టీలు, రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. మట్కా ఆడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆరుబయటి బైక్‌ల అపహరణ

- కొద్దిగంటల్లో యథాస్థానంలో..
- నిందితుడికి బాధితుల దేహశుద్ధి
- కుటుంబ సభ్యులకు అప్పగింత



సంజీవ్‌ను స్తంభానికి కట్టేసిన బాధితులు

కెరమెరి: మండల కేంద్రంలో రాత్రివేళ ఆరుబయట ఉంచిన ద్విచక్రవాహనాలను వినియోగిస్తున్న నిందితుడిని బాధితుడు పట్టుకున్నాడు. వివరాలు.. మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన నీలమ్‌వాడ్ సంజీవ్ కొద్ది రోజులుగా అర్ధరాత్రి ఇళ్ల ముందున్న ద్విచక్రవాహనాలను తీసుకువెళ్తున్నాడు. వేకువజామున తిరిగి సదరు బైక్‌లను యథాస్థానంలో ఉంచుతున్నాడు. శ్రీహరికి చెందిన బైక్‌ను ఇలా నాలుగుసార్లు తీసుకువెళ్లి తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో మళ్లీ అదే స్థానంలో ఉంచాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి 12గంటల నుంచి శ్రీహరి బైక్ కనిపించలేదు. గమనించిన శ్రీహరి ఎలాగైనా బైక్ తీసుకువెళ్తున్న వ్యక్తిని పట్టుకోవాలని ప్లాన్ వేశాడు. సోమవారం తెల్లవారుజాము వరకు కాపు కాశాడు. సరిగ్గా 3గంటల ప్రాంతంలో సంజీవ్ బైక్ తీసుకు రాగా, శ్రీహరి అతడిని పట్టుకున్నాడు. వెంటనే స్తంభానికి కట్టేసి చితకబాదినట్లు సమాచారం. ఇలా రోజూ బైక్‌లు తీసుకువెళ్లి ఎక్కడకు వెళ్తున్నావని పలువురు ప్రశ్నించగా సంజీవ్ సమాధానం చెప్పలేదు. చివరకు అతడి కుటుంబీకులను పిలిపించి సంజీవ్‌ను అప్పగించారు.

రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



గాయపడిన రమేశ్, దీప, మహేశ్

- నలుగురికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సాయికుంటకు చెందిన రేగుంట రమేశ్ తన కూతురు దీపతో ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తున్నాడు. మరో ద్విచక్రవాహనంపై భూపాలపల్లి జిల్లా బండ్లపల్లి గ్రామనికి చెందిన బండి మహేశ్, స్థానిక శ్రీరాంపూర్ ఆర్కే-6 కాలనీ కొత్తరోడ్‌కు చెందిన బీ నవీన్ ద్విచక్రవాహనంపై వచ్చారు. ఐబీ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వైపు వస్తుండగా వెనుకాల మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వెంకటేశ్వర టాకీస్ ఐలాండ్ వద్ద ఈ రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్, దీపకు తీవ్ర గాయాలు కాగా, వీరిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. నవీన్, మహేశ్‌కు స్వల్ప గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందున్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ గణపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన హెచ్‌ఎం మాకొద్దు



జైనూర్ ఆశ్రమ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు

- ఆశ్రమ విద్యార్థినుల ధర్నా

జైనూర్: కొత్తగా వచ్చిన హెచ్‌ఎం మాకొద్దంటూ విద్యార్థినులు సోమవారం జైనూర్ ఆశ్రమ పాఠశాల ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన హెచ్‌ఎం పార్వతి వద్దని, పాత హెచ్‌ఎం సోనురావునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్‌ఎస్ నాయకుడు మెస్రం అంబాజీ ఆందోళన వద్దకు చేరుకుని విద్యార్థినులను సముదాయించారు. విషయం తెలుసుకున్న డీడీ రమాదేవి పాఠశాలకు చేరుకుని విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. రెండురోజుల క్రితం రాసిమెట్ట బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి జైనూర్ బాలికల ఆశ్రమ పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు వద్దు అనడానికి కారణాలు అడిగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఉత్తమ విద్యాబోధన, మౌలిక సదుపాయాల కల్పన, మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

ముగ్గురి అరెస్ట్

మంచిర్యాలక్రైం: స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన వరకట్నం కేసుకు సంబంధించిన ముగ్గురు నిందితులు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతుండగా వారికి స్థానిక మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కే నిరోష నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసినట్లు స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక పోలీస్ టీమ్ సాయంలో నిందితులైన శ్రీరాంపూర్ ఆర్‌కే-5 కాలనీకి చెందిన తనుగుల సుధాకర్‌రెడ్డి, తనుగుల ప్రమీల, తనుగుల నారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.